క్లుప్తంగా

పక్కాగా ఉపాధి పనులు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్‌కుమార్

సారవకోట: ఇచ్చిన కొలతలు ప్రకారం పక్కాగా ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఎంపీడీవో మోహన్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఊర చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. అయితే అక్కడ ఒకేచోట వేతనదారులు పనులు చేయడం గమనించి అసహనం వ్యక్తం చేశారు. ఒకేచోట అందరూ మూకుమ్మడిగా పనులు చేయరాదని, ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, డీఏ కల్యాణి తదితరులు ఉన్నారు.

వెట్టి చాకిరి చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న కొండలరావు

పొందూరు: వెట్టి చాకిరి చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(రాజాం) బి.కొండలరావు అన్నారు. మండల కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. పట్టణంలోని 30 పడకల సామాజిక ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నెలకొన్న వివిధ సమస్యలను వైద్యాధికారి ధర్మాన హరిణి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రోణంకి వెంకట్రావు, ఆస్పత్రి పాలకవర్గం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు



కారులో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐ ఎండీ అమీర్ అలీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ముమ్మరంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యంతో పాటు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, అక్రమ నిల్వలపై సోదాలు చేపట్టారు. మత్తు పదార్థాలు అక్రమ రవాణాను పసిగట్టేందుకు ప్రత్యేకంగా జాగిలానికి పోలీస్ శాఖ నార్కోటిక్ శిక్షణ ఇచ్చింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన దుర్గాప్రసాద్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని బొంతు గ్రామానికి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులు గాయాలపాలయ్యారు. బొంతు జంక్షన్ నుంచి హిరమండలం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని, హిరమండలం నుంచి బొంతు జంక్షన్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో మహాసింగి గ్రామానికి చెందిన పొప్పంగి రాజేష్, గౌడ దుర్గా ప్రసాద్‌లు గాయాలపాలయ్యారు. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

పాపం.. పసుపు రైతు..!



తవ్వకానికి సిద్ధంగా ఉన్న పసుపు పంట

- పోడు పంటగా పసుపు సాగు
- కొనుగోలు చేయని ఐటీడీఏ
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న గిరిజన రైతులు



పసుపు కొమ్ములు ఎండబెడుతున్న గిరిజన రైతు

పాతపట్నం నియోజకవర్గంలో సాగు

మండలం	రైతులు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
ఎల్.ఎన్.పేట	410	950
హిరమండలం	200	410
మెళియాపుట్టి	530	1,150
పాతపట్నం	350	810
కొత్తూరు	280	740

ఎల్.ఎన్.పేట: పచ్చ బంగారమని పిలుచుకునే పసుపు పంట చేతికందివస్తున్న సమయంలో కనీస ధర లభించక గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కొండపోడు పంటగా పసుపు పంటను సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలు నాటుకుంటే రెండేళ్లకు ఒకసారి తవ్వకం చేస్తారు. అప్పుడే పసుపు దిగుబడి ఎక్కువగా ఉంటుందని గిరిజన రైతులు చెబుతున్నారు. ఎటువంటి ఎరువులు వేయకుండా సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. అందువలన కొనుగోలు చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపిస్తారు. కానీ పంటను కొనుగోలు చేసేందుకు ఐటీడీఏ (సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ) ముందుకు రావడం లేదని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం కొనుగోలు విషయాన్ని ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

తక్కువ ధరకే విక్రయం

గిరిజన రైతులు సాగు చేసే వాణిజ్య పంటల్లో ప్రధానం చెప్పుకునేది పసుపు పంట. రెండేళ్ల పాటు ఎంతో కష్టపడి పండించిన పసుపు పంటను తవ్వడం, శుభ్రం చేయడం, ఉడికించి ఎండబెట్టడం చేయాలి. అప్పుడే అమ్ముకునేందుకు నాణ్యమైన పసుపు సిద్ధమవుతుంది. జనవరి నుంచి మార్చి మధ్యలో పసుపు తవ్వకం, విక్రయించడం పూర్తవుతుంది. ఈ మూడు నెలల పాటు పసుపు ధర తగ్గిపోతోందని, కిలో పసుపు గిరిజన రైతులు నుంచి కనీసం రూ.110 నుంచి రూ.120లకు కూడా కొనుగోలు చేయడం లేదని ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఇదే సమయంలో రూ.90 నుంచి రూ.100 మధ్యలో కొనుగోలు చేసి, ఆ తర్వాత రూ.180 నుంచి రూ.200ల వరకు విక్రయించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దళారులు కొనుగోలు చేసిన పసుపు

గతేడాది నష్టపోయాం



పసుపు పంట అమ్ముకునే సమయంలో ధర తగ్గిపోవడంతో గతేడాది నష్టపోయాం. మా దగ్గర నుంచి పసుపు కొమ్ములు కొనుగోలు చేసిన తర్వాత షాపుల్లో ధర పెరిగిపోయింది. మా వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని వెళ్లి, షాపుల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కష్టపడి పండించిన మాకు మాత్రం నష్టమే మిగులుతోంది.

–సవర గంగయ్య, మురగడలోవ, ఎల్.ఎన్.పేట

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



గిరిజన గ్రామాల్లో కొండపోడుగా పండించిన పంటల్లో ప్రధానంగా చెప్పుకునేది పసుపు పంట. ప్రస్తుత సీజన్‌లోనే పసుపు పంట తవ్వడం, శుభ్రం చేయడంతో పాటు ఉడికించి ఎండబెట్టడం జరుగుతుంది. ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి, మద్దతు ధర చెల్లించి గిరిజనుల నుంచి పసుపు కొనుగోలు చేయాలి.

– సవర దిలీప్, కొత్తజోగివలస, ఎల్.ఎన్.పేట

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఈఎండీపీ మేనేజర్ అనూష

పాతపట్నం: విద్యార్థులు సొంత ఆలోచనలతో వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఎ.అనూష అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంట్రప్రెన్యూర్ మైండ్‌సైట్ డవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన వ్యాపారాలు చేయాలని, కొంతమందికి ఉద్యోగాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.సుజాత, ఎన్టీ రామారావు, అనిల్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ చైర్స్ అందజేత



విద్యార్థులకు కుర్చీలు అందజేసిన హెచ్‌ఎం లక్ష్మీనరసింహం, దాతలు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు స్టడీ అవర్‌లో కూర్చోవడానికి హెచ్‌ఎం డి.లక్ష్మీనరసింహం పలువురు వద్ద నుంచి స్టడీ చైర్స్ విరాళంగా సేకరించారు. పాఠశాలలో 129 మంది పదో తరగతి చదువుతుండగా, 130 కుర్చీలు, చదువుకోవడానికి ప్లాంక్‌లు సేకరించారు. సేకరించిన కుర్చీలను దాతలు, సర్పంచ్ మొజ్జాడ రుక్మిణమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ జామి భానుమూర్తి, వైస్ చైర్‌పర్సన్ లక్ష్మీల చేతులమీదుగా విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. భవిష్యత్‌లో దాతలు మరింత సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మొజ్జాడ చక్రపాణి, బూర్లె శ్రీనివాసరావు, బర్రి యతిరాజు, జె.జనార్దనరావు, గరుకు యతిరాజు, ఎ.దశరథరావు, బి.పాపారావు, శ్యామ్, జె.సుందరరావు, వి.తిరుమలరాజు, కె.సంజీవరావు, జి.గోపాలకృష్ణ, బి.సంజీవరావు, పప్పు రాము అన్నదమ్ములు, బిల్లింగి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం రద్దు

పొందూరు: పట్టణంలో శనివారం జరగాల్సిన వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం రద్దు చేసినట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున సమావేశం రద్దు చేస్తున్నామన్నారు. ఎన్నికల అనంతరం సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

క్విజ్ పోటీలు రేపు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు గణిత ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 నుంచి పోటీలు ఉంటాయని చెప్పారు. ఆరో తరగతి నుంచి ఇద్దరు, ఏడో తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులను పంపించాలని సూచించారు. కేవలం గణితంపైనే ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వర్ణోత్సవాలకు సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాల సన్నాహక సమావేశం ప్రిన్సిపాల్ బండారి రవికుమార్ అధ్యక్షతన కాలేజీలో శుక్రవారం జరిగింది. కాలేజీ 1974లో స్థాపించడంతో ఈ ఏడాది స్వర్ణోత్సవాలను ఈనెల 21న నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులతో పాటు ప్రస్తుత కాలేజీ సిబ్బంది నిర్ణయించారు. దీనికోసం పూర్వ విద్యార్థులు తమ వంతుగా విరాళాలు అందజేశారు. సమావేశంలో కాలేజీ మొదటి ప్రిన్సిపాల్ ఎద్దు గోపాలదాసు నాయుడు, కొత్తూరు, మెట్టూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు ఎ.గోవిందరావు, డీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



పోలీసులపై క్రమశిక్షణ చర్యలు

పొందూరు: మండలంలోని కింతలి పంచాయతీ ఖాజీపేటలో జరిగిన కొట్లాట కేసు విషయంలో, స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎస్ఎస్‌పీ రాజు, కానిస్టేబుల్ ఎస్.అప్పలనాయుడులపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి క్రమశిక్షణ చర్యలు శుక్రవారం తీసుకున్నారు. ఐదు రోజుల క్రితం ఖాజీపేటలో రెండు వర్గాలు దాడులు చేసుకున్నారు. అయితే సంబంధిత పోలీసులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతోనే కొట్లాట జరిగిందని నిర్ధారిస్తూ, ఇద్దరిపై ఎస్పీ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

పారదర్శకంగా ఎంఎస్‌ఎంఈ సర్వే జరగాలి

- జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా



పోలాకిలో సర్వేను పరిశీలిస్తున్న సీఈవో శ్రీధర్‌రాజా

పోలాకి: ఎంఎస్‌ఎంఈ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో ఎస్వీ శ్రీధర్ రాజా సూచించారు. మండల కేంద్రంలో సర్వే జరుగుతున్న తీరును శుక్రవారం పరిశీలించారు. అలాగే కేటగిరీ-2 ఎలక్ట్రికల్ డిజిటల్ మీటర్స్, మిస్సింగ్ సిటిజన్ సర్వేలతోపాటు, హౌస్ హోల్డ్ సర్వేలు చేపడుతున్న సిబ్బందిని కలిశారు. సర్వేలో ఎదురవుతున్న అవాంతరాలను ఎప్పటికప్పుడు ఎంపీడీవోల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో రవికుమార్ ఉన్నారు.

నరసన్నపేట: ప్రభుత్వ సూచనల మేరకు గ్రామాల్లో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ సర్వేని సక్రమంగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈవో ఎల్ఎస్వీ శ్రీధర్ రాజా అన్నారు. శుక్రవారం బజారు వీధిలో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి అప్పగించిన మేరకు సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈయనతో పాటు ఎంపీడీవో మధుసూదనరావు, ఈవో ద్రాక్షాయిణిలు ఉన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న నాయకులు

బూర్జ: మండలంలోని శ్రీసనారీ విశ్వేశ్వర విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కటకం రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బలగ వెంకట లింగరాజు, ధర్మవరం మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పాతపాడు గ్రామంలోని కోట దుర్గమ్మ అమ్మవారి ఆలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఎన్నిక చేపట్టారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా సింహాద్రి రవీంద్ర ఆచారి, సహాయ కార్యదర్శులుగా గిరిజల మనోహర్, పెదగాడ దాలీశ్వరరావు, మహిళా అధ్యక్షురాలిగా ఈశ్వరమ్మను నియమించడం జరిగిందని తెలియజేశారు. సంఘ సమావేశంలో హిరమండలం ప్రెసిడెంట్ దుప్పలపూడి రమణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

పొందూరు: మండలంలో గోరింట గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమవ్వనున్నాయి. ఈనెల 8న వేణుగోపాలస్వామికి గరుడ వాహన తిరువీధి, 9న నిత్యారాధన, 10న హోమం, 11న సదస్యమండపారాధన, 12న చక్రస్నానం ముగింపు ఉంటుందని కమిటీ సభ్యులు తెలియజేశారు.



పాతపట్నం: విద్యుత్ అలంకరణలో సాయి మందిరం

ఆలయ వార్షికోత్సవాలు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో ఉన్న సాయినాథ మందిరం 20వ వార్షికోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మందిరం సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 8వ తేదీ ఉదయం శతాధిక కలశాభిషేకం, భక్త బృందంతో భజన కార్యక్రమాలు, ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు, బాబా ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నరసన్నపేట: మండలంలో గుండవల్లిపేటలోని ఉమా స్వయంబేశ్వర స్వామి ఆలయ 12వ వార్షికోత్సవం ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి పంచిరెడ్డి విశ్వనాథం(బుజ్జి) తెలిపారు. వార్షికోత్సవ కార్యక్రమాలను మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ప్రారంభిస్తారన్నారు. ఆదివారం స్వామివారి కల్యాణం ఉంటుందని, సోమవారం అన్నదానంతో పాటు స్వామివారి తిరువీధి నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు రాములమ్మ పేరంటాల జాతర

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటలో శనివారం రాములమ్మ పేరంటాల యాత్ర నిర్వహించనున్నారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున జాతర నిర్వహిస్తారు. శాలిహుండం యాత్రకు వెళ్లి వచ్చేవారు రాములమ్మ పేరంటాలకు పూజలు చేస్తుంటారు. అలాగే పరిసర గ్రామాల ప్రజలు చీరలు, అరటి గెలలతో మొక్కులు తీర్చుకుంటారు. అదేవిధంగా మాకివలస, గోపాలపెంటలకు చెందిన ప్రజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

